
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 22 ఏప్రిల్ 2025



ఆలివ్‌రిడ్లే తాబేళ్లు.. సాగర పర్యావరణ నేస్తాలు



సాగర పర్యావరణ పరిరక్షణలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. సముద్రాన్ని కాలుష్యరహితంగా చేయడంతో తమ వంతు కృషి చేస్తాయి. అందుకే ఈ జాతి తాబేళ్లు అంతరించిపోకుండా జాగ్రత్తలు తీసుకోవల్సిన అవసరముందని గుర్తించారు. జిల్లాలో రెండు కేంద్రాల ద్వారా వీటి వృద్ధికి దోహదపడేందుకు చెన్నైకు చెందిన ట్రీ ఫౌండేషన్, అటవీశాఖలు సమష్టిగా పాటుపడుతున్నాయి.

-8లో

అలిపిరిలో వాహనాల బారులు



తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి చెక్‌పాయింట్ సోమవారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉన్నప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రం మాత్రం వాహనాలతో రద్దీగా మారిపోయింది. సొంతవాహనాల్లో తిరుమలకు వచ్చేవారి సంఖ్య పెరిగిపోవడంతో పాటు ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలతో పటిష్టమైన భద్రతా తనిఖీలు చేపడుతున్నారు. ఈక్రమంలో అలిపిరి కేంద్రం ముందు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు క్యూకట్టాయి. గరుడ సర్కిల్ వరకు వాహనాలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారిపోయింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఇకపై చేరువగా రిజిస్ట్రేషన్ సేవలు

- రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో..
- 30 నుంచి జిల్లాలో అమలు
- సెలవు దినాల్లోనూ రిజిస్ట్రేషన్లు



తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్లు సులభతరం చేసేలా ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటోంది. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి చూసే విధానానికి స్వస్తి పలుకుతూ.. నేరుగా ప్రజలే రిజిస్ట్రేషన్ల కోసం సమయాన్ని నిర్ణయించుకునేలా వెసులుబాటు కల్పిస్తోంది. గత నెల 10వ తేదీన విజయవాడలోని కంకిపాడులో ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 4న రాష్ట్రంలోని 26 జిల్లా ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించింది. దశల వారీగా నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' సాగాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నెల 21, 26, 30వ తేదీలల్లో మూడు విడతలత్లో మొత్తం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జోన్-4లోని జిల్లాలో మొత్తం 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో(ఫేజ్-3) ఈ నెల 30వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ సేవలు మొదలవుతాయి. గూడూరు, కోట, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరితో పాటు చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల, పిచ్చాటూరు, రేణిగుంట, సత్యవేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, తిరుపతి రూరల్, పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

స్లాట్ బుకింగ్ ఇలా...

పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) సిస్టమ్ ద్వారా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ ప్రారంభించవచ్చు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ముందస్తు అపాయింట్మెంట్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎంపిక చేసుకున్న సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. తమ వివరాలు నమోదు చేశాక డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీక్యూఎంఎస్) ద్వారా రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ తీసుకోవచ్చు. తర్వాత డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్, వివాహ రిజిస్ట్రేషన్ లాంటి అవసరమైన సేవలను ఎంపిక చేసుకోవచ్చు. స్లాట్ బుక్ చేసే ముందు రోజే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడంతో పాటు ఫీజులు కూడా చెల్లించాలి. అనంతరం ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రాతిపదికన సిస్టమ్ ద్వారా అప్‌లోడ్ చేసి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ అధికారులు పరిశీలించి సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. లేదా తప్పులున్న దస్తావేజులను కారణాలు సూచిస్తూ తిరస్కరించే అవకాశం ఉంది. ఒకవేళ, డీక్యూఎంఎస్ రద్దు చేసుకోవాలనుకుంటే రూ.100, మార్పు చేసుకోవాలంటే రూ.200 చెల్లించాలి.

ప్రయోజనాలు ఇవీ

స్లాట్ బుకింగ్ వల్ల సమయం ఆదాతో పాటు కార్యాలయాల చుట్టూ తిరిగే వెతలు తగ్గుతాయి. నిర్ణీత సమయంలోనే కార్యాలయంలో హాజరు కావచ్చు. అనధికార కార్యకలాపాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు కూడా అరికట్టవచ్చు. ఇకపై సెలవు దినాల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు. సమయం ఆదాతో పాటు దళారుల్లేని పారదర్శక సేవలను ప్రజలకు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పం. అయితే, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలకమైన పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) అనుభవజ్ఞులు, అవగాహన ఉన్న వారికే సాధ్యమయ్యే పని. సామాన్యులకు అంతగా అర్థమయ్యే విషయం కాదు. మరి ఆచరణకు వచ్చే సరికి ఈ సమస్యను ఎలా అధిగమించాల్సి ఉంటుందనేది చూడాలి.

● బీ అలర్ట్

'కొండ'కు వెళుతున్నారా?

- వాహన చోదకులూ జాగ్రత్తలు తీసుకోండి
- కార్ల దగ్ధం నేపథ్యంలో ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్లలో వస్తున్నారా? అయితే కార్ల యజమానులు, డ్రైవర్లు అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన రాజు సూచించారు. ఇటీవల రెండు కార్ల దగ్ధం నేపథ్యంలో డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇటీవల ఎండా కాలంలో తిరుమలకు వస్తున్న రెండు కార్లు దగ్ధమయ్యాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇలా కార్లు కాలడానికి కారణాలపై నిపుణులను సంప్రదించగా పలు కారణాలు చెబుతున్నారు. సుమారు 500 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఇంజన్ అప్పటికే వేడిగా ఉంటూ ఒత్తిడిలో ఉంటుంది. ఆ వెంటనే తిరుమల ఘాట్ ఎక్కడం ప్రారంభిస్తే ఇంజన్, ట్రాన్స్‌మిషన్‌కు అధిక వేడి వస్తుంది. దీంతో పాటు వంకర రోడ్లు, ఘాట్ రోడ్డు ఎక్కాలంటే అధిక ఇంజన్ శక్తి అవసరం. డ్రైవర్లు ఎక్కువగా తక్కువ గేరులో వెళుతుంటారు. దీనివల్ల ఆర్‌పీఎం పెరిగి వేడి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. తీర్థయాత్రల్లో బరువు బ్యాగులు, ఎక్కువ మందిని తీసుకెళ్ళడం సాధారణం. పాత వాహనాలు, సరిగా సర్వీసు చేయని వాహనాల్లో కూలెంట్ లీక్‌లు, తక్కువ స్థాయి కూలెంట్ ఉండడం, పాడైన రేడియేటర్లు లేదా ఫ్యాన్లు, థెర్మోస్టాట్ లోపాలు, పాడైన ఇంజన్ ఆయిల్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. టూర్‌కు వచ్చే ముందుగా బండిని సర్వీసింగ్ చేయించాలి. రేడియేటర్ లీకేజీలు తనిఖీ చేయాలి. ఫ్యాన్ బెల్టు సరిచూసుకోవాలి. బ్యాటరీల్లో డిస్టిల్ వాటర్ తనిఖీ చేయడం చాలా ముఖ్యం. ప్రతి రెండు గంటలకు ఒకసారి అయిదు నిమిషాల పాటు వాహనం ఆపాలి. వాహనాల డ్యాష్ బోర్డుల మీద థర్మామీటర్, ఆయిల్ గేజ్ మీటర్ పరిశీలిస్తుండాలి. ఘాట్ ఎక్కే సమయంలో ఏసీ ఆఫ్ చేయాలి' అని ఎస్పీ హర్షవర్ధనరాజు వివరించారు.

డిగ్రీ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 22, 23 తేదీల్లో జరగాల్సిన ఈ పరీక్షలను మే 12, 14వ తేదీలకు వాయిదా వేశారు. 24వ తేదీ నుంచీ జరిగే పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

24 నుంచీ పీజీ పరీక్షలు

ఎస్వీయూ పరిధిలో పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. మే ఒకటో తేది దాకా కొనసాగుతాయి. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

తిరుమల ఘాట్‌లో మరో కారులో మంటలు



తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల కిందట తిరుమల రెండో ఘాట్‌లో కారు మంటల్లో కాలిపోయిన ఘటన మరువక ముందే సోమవారం మరో ఘటన చోటుచేసుకుంది. శ్రీవారిని దర్శించుకుని తిరుగుప్రయాణమైన భక్తుల కారు ఇంజన్ నుంచి రాత్రి 11.15 గంటలకు మంటలు చెలరేగాయి. భక్తులు వెంటనే అప్రమత్తమై నీళ్లు చల్లడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. మొదటి ఘాట్‌లోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.



ఉక్కపోతకు ఇంట్లో ఉండలేక బయటకొచ్చిన జనం

తిరుపతిలో 5 గంటల అంధకారం!

- చంద్రగిరి సబ్ స్టేషన్‌లో కాలిన ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉక్కపోత. బయటకొస్తే దోమల బెడద. కరెంటు సరఫరా లేకపోవడంతో తిరుపతివాసులు సోమవారం సాయంత్రం దాదాపు ఐదు గంటలపాటు సతమతమయ్యారు. తరచూ కరెంటు రావడం.. మళ్లీ పోవడంతో ఇబ్బంది పడ్డారు. చంద్రగిరి 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో 7.30 గంటలకు ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చంద్రగిరి 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి అలిపిరి సమీపంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు.. అక్కడ్నుంచి నగరంలోని 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు కరెంటు సరఫరా అవుతోంది. ఈ క్రమంలో తిరుపతితో పాటు చంద్రగిరిలో విద్యుత్ వినియోగం పెరగడంతో 132 కేవీ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులను నియంత్రించే ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో తిరుపతికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి 12.30 గంటల వరకు కరెంటు కాసేపు రావడం.. ఆపై సరఫరా ఆగిపోవడంతో జనం అవస్థలు పడ్డారు. ఇళ్ల బయటే జాగారం చేశారు. నెల రోజులుగా జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. దీనిని అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారు. ముందస్తుగా 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో స్పేర్‌లో ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచలేదు. విద్యుత్ వినియోగం పెరిగిందని చెబుతున్న అధికారులు.. ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఇలాగైతే ఎలా?

- సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ ప్రజాసంఘాలు, రైతులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. వీరికి నాయకులు మద్దతు పలికారు. పీజీఆర్ఎస్ సందర్భంగా కలెక్టరేట్ ముందు తమ డిమాండ్లతో ఆందోళన చేపట్టిన వీరు.. అధికారులకు వినతిపత్రాలిచ్చారు.



వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలంటూ కలెక్టరేట్ ఎదురుగా ముస్లిం మైనార్టీలు ఆందోళన చేపట్టగా, సీపీఎం, సీపీఐ, ఆర్‌పీఐ, సీపీఐ(ఎంఎల్), కాంగ్రెస్, వైసీపీ మద్దతిచ్చాయి. హిందువులు, ముస్లింల మధ్య గొడవలు సృష్టించి లబ్ధి పొందేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి ఆరోపించారు. వక్ఫ్ బోర్డు పరిధిలోని భూములను మోదీ ప్రభుత్వం లాక్కుని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి విమర్శించారు. మహ్మద్ ఖాద్రి, ఇమ్రాన్, ముస్లిం పెద్దలు ఇసాక్‌మాలి, రఫీ హిందూస్తాని, జాఫర్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డులో ముస్లింలు కానివారిని మెజార్టీ సభ్యులుగా చేర్చి ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడానికి సవరణ చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ నల్లచట్టాలను తక్షణం ఉపసంహరించుకోవాలని లౌకికరాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ అంజయ్య డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో నాగరాజు, మురళి, యార్లపల్లిగోపి, వెంకటరత్నం, అంకయ్య, లోకేశ్వర్‌రెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వం



సత్యవేడు మండలం ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం, రాళ్లకుప్పం గ్రామాల్లో 2,583 ఎకరాలను శ్రీసిటీకి కేటాయించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని ఆ ప్రాంత రైతులు డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద వారు ఆందోళన చేపట్టారు. భూములు ఇవ్వడానికి తాము సిద్ధంగా లేమనానరు. గతంలోను శ్రీసిటీ సెజ్ కోసం కేటాయించిన భూముల విషయంలో తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఇంకా రెండు వేల ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని, వీటిని మరో వంద కంపెనీలకు ఇవ్వొచ్చన్నారు. మళ్లీ భూముల కోసం తమ వద్దకు వస్తున్నారని, ధరలు కూడా పెరిగాయని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా పరిశీలించిన్యాయం చేస్తామని జిల్లా అభివృద్ధికి సహకరించాలని రైతాంగానికి సూచించారు. ఈ ఆందోళనలో రైతులు ప్రతాప్‌రెడ్డి, విజయశంకర్‌రెడ్డి, రామకృష్ణ, శీనయ్య, మనోజ్,మునెమ్మ, అజిత్‌కుమార్ పెద్దఎత్తున రైతులు ఈ నిరసనలో పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ఎండను లెక్క చేయక..!

- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు తరలివచ్చిన అర్జీదారులు

'మండే' ఎండను లెక్క చేయలేదు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కారం కాకపోతుందా అన్న ఆశతో అర్జీ చేతపట్టుకుని తిరుపతి బస్సెక్కారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు పెద్దసంఖ్యలో అర్జీదారులు పోటెత్తారు. గత సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా పీజీఆర్ఎస్‌కు సెలవు రావడంతో.. ఈ వారం భారీగా రావడంతో కలెక్టరేట్ కిక్కిరిసింది. మొత్తం 372 అర్జీలు రాగా అందులో రెవెన్యూశాఖవే 260 ఉన్నాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

చెవిరెడ్డి అనుచరులచే 'మఠం' భూముల కబ్జా

- పూర్తిస్థాయిలో విచారణ జరపాలంటూ టీడీపీ నేతల డిమాండ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి రూరల్ మండలం దామినేడు నుంచి సి.మల్లవరం వరకు మఠం భూములు, పంట పొరంబోకులను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అండతో ఆయ అనుచరులు, బినామీలు ఆక్రమించుకున్నారని టీడీపీ నేతలు ఈశ్వరరెడ్డి, అమిలినేని మధు, శ్రీనివాసులు, కిషోర్‌రెడ్డి, పత్తి సుధ తదితరులు జేసీ శుభంబన్సల్ దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే అనుచరులు భూములను కబ్జా చేసి అడ్డదారిలో పట్టాలు పొందారన్నారు. ఆక్రమణలో ఉన్న భూములను, అక్రమ కబ్జాలపై విచారణ జరిపి మఠం, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు. నేతలు మధుశేఖర్, సాయి రాయల్, మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి, టీడీపీశ్రేణులు వినతిపత్రం ఇచ్చారు.



జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి

తిమ్మప్ప దేవాలయం పునర్నిర్మాణానికి చర్యలు



తిమ్మప్ప దేవాలయాన్ని పరిశీలిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలోని తిమ్మప్ప దేవాలయాన్ని త్వరలోనే టీటీడీ ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని బీజేపీ నాయకులతో కలిసి తిమ్మప్ప దేవాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హైదర్ ఆలీ ధ్వంసం చేసిన ఆలయాల్లో ఇది కూడా ఉందని తామ్రశాశనం చెబుతోందన్నారు. అన్నమయ్య వంశానికి చెందిన చిన్నన్న, పద్మశాలి కులస్థులు దీనిని పునర్నిర్మాణం చేపట్టినట్లు చరిత్ర చెబుతోందన్నారు. ఆలయానికి ఉన్న 18 ఎకరాల భూమి కాలక్రమేణా అన్యాక్రాంతమైందన్నారు. కేవలం 21 సెంట్ల భూమి మాత్రమే మిగిలిందన్నారు. ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరినట్లు చెప్పారు. రానున్న దర్మకర్తల మండలిలో ఈ అంశాన్ని చర్చించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాదిరి ధనంజయరెడ్డి, బీజేపీ నాయకులు వెంకటముని, సుబ్రమణ్యంయాదవ్, మునిగంగిరెడ్డి, దొరస్వామి, టీడీపీ నాయకులు శంకర్, తదితరులుపాల్గొన్నారు.

'మనమిత్ర' యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



వాట్సప్ గవర్నెన్స్ కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

భాకరాపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'మన మిత్ర' యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య సూచించారు. ఈ యాప్ కరపత్రాలను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో యాప్ గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ఆధారిత చాట్‌బాట్‌లో లభ్యమయ్యే అన్ని రకాల సేవలను పొందవచ్చునన్నారు. డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన రశీదులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. మనమిత్ర (నంబరు 9552300009) ద్వారా అన్ని రకాల సేవలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, ఏవో సతీశ్ కుమార్, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ అలీ ఖాన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, కృష్ణమూర్తి,చంద్రశేఖర్, మురళీ, బెల్లంకొండ రమణ,గురుమూర్తి, వెంకటనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చంద్రగిరి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో కిండర్ గార్డెన్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. గ్రేడ్ 1 నుంచి 10వ తరగతి వరకూ సంబంధించి వివిధ విభాగాల్లో పతిభ ఆధారంగా ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. వారికి ఆవార్డులను అందించారు. స్కూల్ చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను, విజ్ఞానాభివృద్ధి,విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇరంగాపల్లె పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు

పాకాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇరంగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గత 35 యేళ్లుగా ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఈవో బాబ్జీ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంజని, ఉపాధ్యాయులు నాగసరిత, శ్రీధర్ రెడ్డి, రెడ్డిసుశీల, రూత్ పావని, జయప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఐ.నాగరాజ, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రకాష్‌రెడ్డి, అరుళ్ సెల్వి, భారతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రైవర్ సొంతపనులకు 'చెత్త వాహనం'!



పాకాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పంటపల్లె పంచాయతీ చెత్త తరలింపు వాహనాన్ని ఆ వాహనం డ్రైవర్ పవన్ సొంత పనులకు వినియోగించుకొంటున్నాడు. పశు గ్రాసం తరలింపు, ఇతర పనులకు వినియోగించుకొంటున్న ఫొటోలు సామాజిక మాధ్యమాలలో హల్‌చల్ చేస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శి హరిణి వివరణ కోరగా ఒక్కసారి మాత్రమే ఇలా వినియోగించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

యూడీఎస్ సమస్యకు త్వరలో పరిష్కారం



తుమ్మలగుంటలో మహిళలతో సుధారెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తమ్మలగుంట పంచాయతీలోని సమస్యలను ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన సతీమణి సుధారెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం సాయంత్రం మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో యూడీఎస్ సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మఠం భూములను కబ్జాచేసి పేదలకు విక్రయించారని, తెలిసో తెలియకో దానిలో ఇళ్లు నిర్మించుకుంటే తిరిగి వారే కూలదోశారని విమర్శించారు. పేదలు నిర్మించుకున్న ఇళ్లు కూలదోసినవారు ఇప్పుడు మీటర్లు అడగడం ఎంతవకు న్యాయమన్నారు. మహిళలు తమ సమస్యలను విన్నవించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



మృతి చెందిన మస్తాన్

ఓజిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహ దారిపై సోమవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొ న్నాయి. ఈ ప్రమాదంలో గూడూరుకు చెందిన మస్తాన్(40) మృతి చెందగా, అదే మండలంలోని లింగసముద్రం గ్రామానికి చెందిన సుధీర్, ప్రవీణ్ కుమార్ గాయపడ్డారు. ఓజిలి ఏఎస్ఐ గురుమూర్తిరాజు కథనం మేరకు... పెద్దపరియ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఓ తారు ప్లాంటులో గూడూరుకు చెందిన మస్తాన్ డ్రైవర్, వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి మండలంలోని రాజుపాళెం గ్రామానికి మోటరు సైకిల్‌పై వెళ్లి తిరిగి రాంగ్ రూట్‌లో వస్తుండగా లింగసముద్రం గ్రామానికి చెందిన సుధీర్, ప్రవీణ్ కుమార్ మోటర్ సైకిల్‌పై వెళ్తూ పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిని సుధీర్, ప్రవీణ్‌కుమార్‌ను 108 వాహనంలో గూడూరు ఆస్పత్రికి తర లించారు. ప్రవీణ్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

జీపును ఆటో ఢీకొని భక్తుడికి తీవ్ర గాయాలు



గాయపడిన భక్తుడు

చంద్రగిరి, ఏప్రిల్ 21(ఆంధ్ర జ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలో సోమవారం ఉదయం జీపును ఓ ఆటో ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు బెంగళూరు రమణానాయక్ తన కుటుంబ సభ్యులతో శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు కాలినడకన వెళ్ళడానికి తిరుపతిలో షేర్ ఆటో ఎక్కారు. దర్శనం టోకెన్ల కోటా పూర్తవుతుందనే తొందరలో ఆటో డ్రైవర్ ముందు వెళ్ళుతున్న వాహనాన్ని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న జీపును ఢీకొన్నాడు. ఆటో,జీపు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న భక్తుడు రమణానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలినడక మార్గంలో కర్ణాటక బాలుడి అదృశ్యం



శ్రీనివాస్(ఫైల్‌ఫొటో)

తిరుమల, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలో కర్ణాటకవాసి కనిపించకుండా పోయాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. రాయచూర్ జిల్లా ముద్గల్‌గ్రామానికి చెందిన రాజేశ్వరి తన పదహేళ్ల కుమారుడు శ్రీనివాస్, బంధువులతో కలిసి ఈనెల19న అలిపిరికి చేరుకుంది. కాలినడకను ప్రారంభించిన క్రమంలో రాజగోపురం సమీపంలో శ్రీనివాస్ కనిపించలేదు. దీంతో అతని తల్లితో పాటు బంధువులు సమీప ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా తిరుపతి వైపు వెళ్లినట్టుగా ఫుటేజ్ లభించింది. చెముడు, మూగ సమస్యలున్న శ్రీనివాస్ వివరాలు తెలిసిన వారు 94407 96772 నంబరుకు తెలియజేయాలని పోలీసులు సోమవారం ఓ ప్రకటన ద్వారా కోరారు.

గజలక్ష్మీ నమోస్తుతే..



తిరుచానూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారు గజవాహనంపై కొలువుదీరి ఆలయమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. జన్మనక్షత్రం ఉత్తరాషాడ పురస్కరించుకుని సోమవారం వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు అభిషేకం చేశారు. మధ్యాహ్నం సుగంధ పరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం గజవాహన సేవ తిరుమాడ వీధుల్లో వేడుకగా జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ



మిట్టూరులో పోలీసుల బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిట్టూరులో ఆదివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో ఐదుగురు గాయపడ్డారు. అలిపిరి ఎస్ఐ లోకేష్ వివరాల మేరకు... మిట్టూరులో ఏటా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆ ప్రాంతానికి చెందిన ధోనిరెడ్డి, వెంకటముని కుటుంబాల మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి స్వామి వారి ఊరేగింపులో వెంకటముని వర్గీయులు ధోనిరెడ్డి, ఎం.పవన్‌ల కళ్లలో కారం చల్లి కత్తితో తీవ్రంగా గాయపరిచారు. ధోనిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటముని, అతని భార్య మునిలక్ష్మి, కుమారుడు సాయికుమార్, తిరుచానూరుకు చెందిన దాము, గోపి, శంకర్ రెడ్డిలపై కేసు నమోదు చేశారు. వెంకటముని భార్య మునిలక్ష్మి ఫిర్యాదు మేరకు ధోనిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ చెప్పారు.

నాలుగు బెల్టు దుకాణాలపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని నాలుగు బెల్టు దుకాణాలపై అలిపిరి, ఈస్ట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. భారతి బస్టాండు వద్ద మామ వైన్స్ ప్రతాప్ థియేటర్ వద్ద డీఎంకే వైన్స్ అలిపిరి పరిధిలో మరో రెండు దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ భక్తవత్సలం చెప్పారు. మద్యం దుకాణాల వద్ద కూర్చోబెట్టి తాగించినా, కూల్‌డ్రింక్ షాపుల్లో మద్యం విక్రయాలు చేసినా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ప్రభుత్వ న్యాయవాదికి అదనపు బాధ్యతలు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోర్టులో భూసేకరణ కేసులు విచారించే ప్రభుత్వ న్యాయవాది శాఖమూరి ఆదినారాయణకు 3, 4, 5, 10 అదనపు జిల్లా కోర్టులకు ప్రభుత్వం తరపున ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్‌గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అరుదైన భూ మూలకాల పరిశోధనతో ప్రగతి

● అంతర్జాతీయ సదస్సులో వక్తలు



సదస్సును ప్రారంభిస్తున్న నిఖోనన్ పాథమ్, చిత్రంలో ఎస్వీయూ, పద్మావతి, విక్రమ సింహపురి వర్సిటీ వీసీలు అప్పారావు, ఉమ, శ్రీనివాసరావు, సదస్సు నిర్వాహకులు దేవప్రసాదరాజు, జాన్ సుష్మా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూమి లోపలి అరుదైన మూలకాలు మానవాళి అభివృద్ధికి ఉపయోగపడేలా పరిశోధనలు చేపట్టాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఎస్వీయూ ఫిజిక్స్-పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు సోమవారం పద్మావతి వర్సిటీ ఆడిటోరియంలో ప్రారంభమైంది. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలగకుండా, భూ మూలకాలు తీసి ప్రాసెసింగ్ చేయాలన్నారు. దేశ ప్రగతికి ఇవి ఉపయోగపడేలా చూడాలన్నారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ.. ఆపరేషన్లు చేయడంలో, రోగ నియంత్రణలో మూలకాలు తోడ్పడతాయన్నారు. విక్రమసింహపురి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బోధన, పరిశోధన రంగాల్లో ఈ మూలకాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. థాయిలాండ్ ప్రతినిధి జాక్రపాంగ్ కియోఖో, ఇండోనేషియా ప్రతినిధి మిత్ర డి జవ ఎల్ లు మాట్లాడుతూ.. ఈ మూలకాలు సౌరశక్తిని విద్యుత్‌గా మార్చడానికి తోడ్పడుతున్నాయన్నారు. రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు దీపేంద్రసింగ్, ఎంఎల్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షులు సీకే జయశంకర్‌లతో పాటు దేశ, విదేశాలకు చెందిన 200 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.. అతిథులు, ప్రతినిధులను సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ జాన్‌సుష్మా సత్కరించారు. ఎస్వీయూ,పద్మావతి వర్సిటీల రిజిస్ట్రార్‌లు భూపతినాయుడు,రజని పాల్గొన్నారు.

ఆర్సీపురానికి తహసీల్దారు లేక..!

● మూడు వారాలుగా ఇబ్బంది పడుతున్న జనం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలానికి మూడు వారాలుగా తహసీల్దారు లేరు. ఈ నెల ఒకటో తేది నుంచి తహసీల్దారు వెంకటరమణ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. అప్పట్నుంచి అక్కడ ఎవరినీ ఇన్‌ఛార్జిగా నియమించలేదు. కింది స్థాయిలో ఓ అధికారిపై అటు ప్రజల్లోను, ఇటు అధికారుల్లోను అసంతృప్తి ఉండటంతో అతనికి కూడా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించలేదని తెలిసింది. 21 రోజులుగా రెవెన్యూ కార్యక్రమాలు స్తంభించాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు మండల కార్యాలయానికి తిరుగుతున్నారు. తహసీల్దారు పోస్టులో ఎవరినీ నియమించకుండా తానే ఇన్‌ఛార్జి కావాలని ఓ ఉద్యోగి జిల్లా ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు సమాచారం. అతడిపై ఉన్న ఆరోపణలతో ఫైల్ పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రెండు రోజుల్లో పూర్తి స్థాయి తహసీల్దారును నియమిస్తామని చెప్పారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలంటూ ధర్నా



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను, ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి వెంకటరత్నం కోరారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకయ్య, ఐఎఫ్‌టీయూ తిరుపతి కన్వీనర్ లోకేష్, పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ అరుణ రేఖ, సుజాత, నాగరత్న, కాంచన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ అనుమానాస్పద మృతి



మృతి చెందిన కృష్ణానాయక్

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వలస కూలీ అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన ముడావత్ కృష్ణానాయక్(26) బతుకుదెరువు కోసం తిరుపతికి వచ్చాడు. మనోజ్ ఫ్రేమ్ వర్క్సులో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వివాహమైంది. కుటుంబాన్ని పోషించలేని స్థితిలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆయన తండ్రి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ ఎస్వోపై అత్యాచారం కేసు

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీ సిటీలోని ఓ పరిశ్రమలో భద్రతా విభా గంలో పని చేస్తున్న ఓ సెక్యూరిటీ అధికారి తనపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మహిళా కార్మి కురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీసిటీ పోలీ సులు కేసు నమోదు చేశారు. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు శ్రీసిటీ పరిధిలోని ఓ పరి శ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుల దీప్(27) సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తు న్నాడు. అదే పరిశ్రమలో పని చేస్తున్న తడ మండలానికి చెందిన ఒక మహిళ పట్ల కులదీప్ గత కొంతకాలంగా అసభ్యంగా ప్రవ ర్తిస్తున్నాడు. మహిళ శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

25న జాబ్ మేళా

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో సత్యవేడులోని శ్రీదాస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 25న నిర్వహించనున్న మెగాజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ పరంధాం, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ చైతన్యతో కలిసి జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో 16 బహుళ జాతీయ కంపెనీలలో 800 ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు

తొలగింపు ఉత్తర్వులు తాత్కాలికంగా నిలిపివేత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్‌లో ఇటీవల పలువురు ఉద్యోగులను తొలగించారు. వీరు తమకు న్యాయం చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారిని తొలిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ వీరిని విధులకు అనుమతించాలని కోరింది.

మురళీకృష్ణకు డాక్టరేట్



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ జ్యోతిష్య పండితులు ఎస్.మురళీకృష్ణకు జ్యోతిష్యప్రవీణ శిరోమణి పురస్కారం, డాక్టరేట్ లభించింది. ఆదివారం సింహాచలంలో ఎస్ఎస్‌లైవ్ ఆస్ట్రాలజీ వ్యవస్థాపకుడు నరసింహస్వామి ఆధ్వర్యంలో జ్యోతిష్య శాస్త్రానికి సంబంధించి మెగా సదస్సు నిర్వహించారు. ప్రవీణ, శిరోమణి స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మురళీకృష్ణ ఉత్తీర్ణులయ్యారు. ఆయనకు నరసింహస్వామి ప్రశంసాపత్రం, డాక్టరేట్ అందించారు.

నేటి నుంచి మంత్రుల పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో మంగళ, బుధ, గురువారాల్లో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్ పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 8.45 గంటలకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రుయాస్పత్రికి.. అనంతరం చిత్తూరుకు వెళతారు. బుధవారం ఉదయం 10 గంటలకు తిరిగి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తిరుపతికి చేరుకుని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉదయం 9 గంటలకు శ్రీసిటీలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 నుంచి 6గంటల వరకు రౌతుసూరమాల, శ్రీకాళహస్తి, రేణిగుంటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి తిరుపతి పద్మావతి అతిథి గృహంలో బసచేస్తారు. గురువారం ఉదయం పది గంటల నుంచి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అధికారులు, పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశమవుతారు.

విరిసిన నవ వసంతం



వసంత రుతువు కొత్త ఉత్సాహానికి ప్రతీక.. మోడువారిన చెట్ల కొమ్మలు సైతం ఈకాలంలో చిగురిస్తాయి. పూర్వ అందాలను సంతరించుకుంటాయి. ఆశావాదానికి ప్రేరణ కలిగిస్తాయి. .తిరుపతి అన్నారావు సర్కిల్‌లో ఈ చెట్టును చూడండి. ఈనెల ఆరంభంలో ఆకులన్నీ రాలిపోయి కళ విహీనమైంది. చైత్రమాసం రాకతో రెండు వారాలకే కొత్త చిగురు తొడుక్కుంది. పచ్చదనంతో మళ్లీ నిలదొక్కుకుంది. పులకింపజేస్తోంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

డీసీసీబీ లాభాల్లో రైతులకు 2.25 శాతం డివిడెండ్

● సీఈవో సి. శంకరబాబు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంకుకు వచ్చిన లాభాల్లో రైతులకు 2.25 శాతం డివిడెండ్‌గా ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి సి. శంకరబాబు తెలిపారు. 2024-25వ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుకు రూ.17.26 కోట్ల లాభాలు(ప్రొవిజినల్ లాభం) వచ్చాయని, ఇందులో రూ.12.76 కోట్లు నికర లాభం వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఆడిట్ తర్వాత దీనిపై స్పష్టత వస్తుందన్నారు. ఈ మొత్తంలో రూ.1.90 కోట్లు బ్యాంకులో సభ్యత్వం ఉన్న అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా (సింగిల్ విండోలు)ల్లో ఎ క్లాస్ సభ్యులకు డివిడెండ్ కింద చెల్లిస్తామన్నారు.

● **రూ.4430 కోట్ల వ్యాపారం :** 2025-26వ ఆర్థిక సంవత్సరంలో రూ.4430 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో స్వల్పకాలికేతర (ఎస్టీ) రుణాలు రూ.550 కోట్లు, పంట రుణాలు రూ.700 కోట్లు పంపిణీ చేయాలని నిర్ణయించాం. రాష్ట్రంలో మరే డీసీసీబీలో ఇవ్వని విధంగా బంగారం కుదువపై రుణాల రూపేణా రూ.1150 కోట్లు ఇవ్వాలని నిర్ణయించాం. 2024-25లో బంగారం కుదువపై రూ.876కోట్లు వ్యవసాయదారులకు అందించాం. ఇందులో వ్యవసాయ రుణాలుగా రూ.56 కోట్లు, వ్యవసాయేతర రుణాలుగా రూ.820 కోట్లు అందించాం. గత ఆర్థిక సంవత్సరంలో రూ.3450 కోట్ల వ్యాపారం జరిగింది. ఇందులో రుణాల కింద రూ.2436 కోట్లు మంజూరు చేశాం. మిగిలిన రూ.998 కోట్లు డిపాజిట్ల రూపంలో వచ్చాయి.

● **మొండి బకాయిలు :** డీసీసీ బ్యాంకుకు సుమారు రూ.85 కోట్ల వరకు మొండిబకాయిలున్నాయి.వీటిపై ప్రత్యేక దృష్టి పెడతాం. ప్రతి బ్రాంచ్ నుంచి రెండు ఖాతాలకు చెందిన భూములను వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే నిరర్థక ఆస్తులు (ఎన్పీఏ) తగ్గాయి. 2023-24లో ఎన్పీఏ 3.51శాతం ఉంటే, 2024-25 సంవత్సరానికి 3.45 శాతానికి తగ్గింది.

● **డిపాజిట్ల సేకరణ :** డిపాజిట్ల సేకరణపై ఈ ఏడాది ప్రత్యేక దృష్టి సారిస్తాం. దీనివల్ల బ్యాంకుకు సొంత వనరులు సమకూరుతాయి. 2023-24లో రూ.932 కోట్లు, 2024-25లో రూ.998 కోట్లు డిపాజిట్లు సేకరించాం. ఇతర బ్యాంకులతో పోలిస్తే చిత్తూరు డీసీసీబీ నుంచి ఎక్కువ వడ్డీ చెల్లిస్తున్నాం. 333 రోజులకు మహిళలకోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అవని డిపాజిట్ స్కీమ్ కింద 8.50 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు ఇతర బ్యాంకులకన్నా 0.50శాతం వడ్డీ అధికంగా ఇస్తున్నాం. త్వరలో నెట్ బ్యాంకింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని శంకరబాబు వివరించారు.

మెగా డీఎస్సీ విడుదలపై హర్షం



చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ విడుదల పట్ల టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత హర్షం తెలిపాయి. ఎస్వీయూలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చిత్రాలకు వారు పాలాభిషేకం చేశారు. నాయకులు శేషాద్రినాయుడు, రామ్మోహన్, ఆర్కే నాయుడు మాట్లాడుతూ 16 వేలకు పైగా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషకరమన్నారు. మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ ప్రారంభించారు. ప్రజలకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. కాగా, మూడేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరుడు కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను అద్దెకు తీసుకున్నాడు. రూ.5 లక్షల వరకు అద్దె ఎగ్గొట్టి ఖాళీ చేసి వెళ్లాడు. అధికారులు అతనికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది.

పేదలకు అన్నదానం


హరిప్రసాద్‌కు చిత్రపటం అందజేస్తున్న జనసేన నాయకులు

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ జన్మదిన వేడుకలు సోమవారం నగరంలో ఘనంగా జరిగాయి. అనంతవీధి సర్కిల్ వద్ద జనసేన సీనియర్ నాయకుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన హరిప్రసాద్‌ను ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, నరసింహాచారి, నరేంద్రనాథ్, కూటమి నాయకులు ఆముదాల వెంకటేష్, సుబ్బు యాదవ్, 36వ డివిజన్ జనసేన అధ్యక్షుడు వినోద్ రాయల్, నాయకులు ఆకేపాటి సుభాషిణి, సిరిగిరి జయకృష్ణ, శేషాద్రి, ప్రకాష్, మునిరత్నం, ముని యాదవ్, చిరంజీవి, కోకిల, లక్ష్మి, మధులత, శిరీష, దివ్య, రాధా పాల్గొన్నారు.

● తిరుపతి(ఆర్సీ): జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ జన్మదినం సందర్భంగా సోమవారం విష్ణునివాసం ముందు అన్నదానం చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌యాదవ్, ఆటోట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఆయనకు శాలువకప్పి సత్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుణశేఖర్ యాదవ్, మోహన్, వినోద్, పోలమ్మ, మనోహర్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

28నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న రామకృష్ణమిషన్ ఆశ్రమంలో ఈనెల 28నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు 'సంస్కార శిబిరం' పేరిట పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ ప్రతినిధి శ్రీకాంత్ మహరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాసనాలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, డ్రాయింగ్, భజనలు, సంస్కృత శ్లోకాలు, శ్రీమద్ భగవద్గీత, పూలమాల తయారీ విధానం, భారత సనాతన సంస్కృతి, కర్రసాము, విలువిద్య, వ్యక్తిత్వవికాసం వంటి వాటిలో ఉదయం 8.15నుంచి మధ్యాహ్నం 12.15వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 5 నుంచి 10వ తరగతి బాలబాలికలు మాత్రమే అర్హులని వివరించారు. ముందు వచ్చినవారికి ముందు ప్రాధాన్యత ప్రాతిపదికన పేర్లను నమోదు చేసుకుంటారని, పూర్తిగా శ్వేత వస్త్రధారణతో రావాల్సి ఉంటుందని వెల్లడించారు. రూ.1,200 రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఉదయం ఉపాహారం అందజేస్తారని, మరిన్ని వివరాలకు 9493107001, 6360150945లను సంప్రదించాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఐదు లేబర్ కోడ్‌ల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మే 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ తిరుపతి నగర కార్యదర్శి రవి కోరారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగిన నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా ఏర్పడిన కార్మిక చట్టాలను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రద్దు చేయడమేగాక కార్పొరేటర్లకు అనుకూలంగా సవరణ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించాల్సింది పోయి ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. దీనిపై కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు కేవై రాజా, సీహెచ్ శివకుమార్, శ్రీనివాసులు, సురేష్, గురవయ్య పాల్గొన్నారు.

అగ్రిటెక్‌పై నేటి నుంచి జాతీయ సదస్సు

- వ్యవసాయ కాలేజీ అసోసియేట్ డీన్ రమణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కాలేజీలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ వెల్లడించారు. వ్యవసాయ సాంకేతికత - ఆహార భద్రత అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీసీ శారదాజయలక్ష్మి, ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌హూర్‌సింగ్, మరట్వాడా విద్యాపీఠ్ వీసీ వసంతరావునాయక్, శాస్త్రవేత్తలు పళనిముత్తు, హరికిషన్, మనీష్ పాండే పాల్గొంటారని వెల్లడించారు. 762 మంది పీజీ విద్యార్థులు ప్రతినిధులుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు.

ఎంజీఎం విద్యార్థులకు కలెక్టర్ అభినందన



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయిలో నిర్వహించిన రెజ్లింగ్, హాకీ పోటీల్లో ఎంజీఎం విద్యార్థులు ప్రణీత, జ్యోతిర్మయి(రెజ్లింగ్), మహాలక్ష్మి(హాకీ) ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. డీఈవో కేవీఎన్ కుమార్, హెచ్ఎం ముని పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ ఇంటిపై దాడి

- కండక్టర్ భర్తపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం)/అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీ ఇంటిపై దాడి చేసిన ఘటనలో కండక్టర్ భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. తిరుపతి సమీపంలోని కాటన్ మిల్లు వద్ద కాపురమున్న రవి భార్య లక్ష్మీదేవి తిరుపతి డిపోలో కండక్టర్‌గా పనిచేస్తోంది. ఆమెకు సులువుగా ఉన్న, అడిగిన చోట డ్యూటీలు వేయలేదని భర్త రవి ఆదివారం సాయినగర్‌లోని డిపో మేనేజర్ ఇంటి వద్దకెళ్లి దౌర్జన్యం చేశాడు. డిపో మేనేజర్ ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేశారు.

'మా భూమిని కాజేయాలని చూస్తున్నారు'

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని నారాయణపురం వద్ద ఉన్న తమ భూమిని కాజేయాలని చూస్తున్నారని శ్రీమన్నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 2003 నుంచి 2024 వరకు కోర్టు పరిధిలో తొమ్మిది జడ్జిమెంట్లు వచ్చిన భూమిపై పోలీసులను అడ్డుపెట్టుకుని బెదిరిస్తున్నారని వాపోయారు. అర్ధరాత్రి 20 మందితో కలసి తమ భూమి వద్దకు వచ్చారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

గోశాల ఘటనపై సవాల్ హాస్యాస్పదం

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గోశాల ఘటనపై వైసీపీ నాయకులకు టీడీపీ నేతలు సవాల్ విసరడం హాస్యాస్పదమని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గోవులు చనిపోయాయని చెబితే దానిపై విచారణ జరపకుండా విమర్శలు, సవాల్ చేయడం సరికాదన్నారు. గోవుల మృతిని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

గోశాలకు జంబో కూలర్ల వితరణ


కూలర్లను అందజేస్తున్న కిరణ్ రాయల్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్వీ గోశాలకు స్థానిక జనసేన నేత కిరణ్‌రాయల్ నాలుగు జంబో కూలర్లను వితరణ చేశారు. సోమవారం ఉదయం ఆయన గోశాలను సందర్శించి గోవులకు దాణా తినిపించారు. టీటీడీ డీఎఫ్‌వో శ్రీనివాస్‌ను సంప్రదించి గోవుల ఆరోగ్యం, వాటి దాణా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెన్నై నుంచి తెప్పించిన దాదాపు రూ.లక్ష విలువచేసే జంబో కూలర్లను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి సుభాషిణి, హేమకుమార్, మనోజ్, వంశీ, లోకేశ్, పురుషోత్తం, దేవ, ముని, నవీన్, సాయి, రాహుల్ పాల్గొన్నారు.

అక్షయ తృతీయకు ప్రత్యేక ఆఫర్లు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు పెట్టినట్లు మలబార్ గోల్డ్ షోరూం హెడ్ రిజీష్ తెలిపారు. ఆఫర్లను సోమవారం ఉదయం షోరూంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. తన్విక సరికొత్త ఆభరణాన్ని ఆవిష్కరించారు. బంగారు, డైమండ్స్ ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం, వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు రిజీష్ చెప్పారు. ఈ ఆఫర్లు మే 4వ తేదీ వరకు ఉంటాయని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఐతో ఎన్నో ప్రయోజనాలు


ప్రిన్సిపాల్ నరసయ్యను సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏఐతో ఎన్నో రకాల ప్రయోజనాలున్నాయని ఎస్వీయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసయ్య తెలిపారు. పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పారదర్శకంగా ఏఐని వాడితే మంచి ఫలితాలున్నాయన్నారు. మేధావులు, సాంకేతిక నిపుణుల మధ్య సమన్వయంతో ఏఐని ప్రయోజనకారిగా మార్చవచ్చని అన్నారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు వెంకటకృష్ణ ఏఐ టెక్నాలజీతో ఏర్పడే సమస్యలకు తగిన పరిష్కారాలు కనుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, దుద్యాల చంద్రమోహన్, ప్రొఫెసర్ త్రిపురసుందరి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ అధ్యాపకుడికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం


సోమనాథదాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీ పరిశోధన, ప్రచురణ విభాగ అధ్యాపకుడు డాక్టర్ సోమనాథదాస్ కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారానికి ఎంపికయ్యారు. ఒడియా భాషలో బ్రజ్‌మోహన్ మహంతి రాసిన లలితల వంగలత నవలను సంస్కృతంలోకి అనువదించారు. దీనికి గాను పురస్కారానికి ఎంపిక చేశారు. తామ్రపత్రం, రూ.50 వేల నగదుతో త్వరలో సోమనాథదాస్‌ను సత్కరిస్తారు. ఈ మేరకు కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ సమాచారాన్ని పంపారు.

కరకంబాడీ రోడ్డుకు విద్యుత్ కాంతులేవీ..?

- టీటీడీ నిర్వాకంపై సర్వత్రా విమర్శలు


వెలగని వీధి దీపాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డు విద్యుత్ కాంతులకు మంగళం పాడేసినట్టు తెలుస్తోంది. ఈ విషయంలో టీటీడీ నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దశాబ్దకాలంగా కరకంబాడీ రోడ్డుమీదుగా భక్తులకు సంబంధించిన వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో ఆ రోడ్డు నిర్వహణ బాధ్యతలను టీటీడీ తీసుకుంది. తొలుత వీధిలైట్లపై దృష్టి సారించింది. నగర శివారు ప్రాంతమైన వెంకటేశ్వరకాలనీ నుంచి వెంకటాపురం వరకు అధునాతన వీధిలైట్లు ఏర్పాటు చేసింది. ఈ పనులు జనవరిలోనే పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరాకు రూ.13,13,458 చెల్లించి ఎస్పీడీసీఎల్ ద్వారా పది సర్వీసులు పొందాల్సి ఉండగా ఆ దిశగా చర్యలను విస్మరించింది. అయితే ఫిబ్రవరి 16 నుంచి మంగళంలోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ ఆలయాల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరవడంతో బాధ్యతగా ఎస్పీడీసీఎల్ ఉచితంగానే విద్యుత్ సరఫరా చేసింది. దీంతో వారం రోజుల పాటు ఆ రోడ్డు విద్యుత్ కాంతులతో కళకళలాడింది. ఆ తర్వాత కొన్ని రోజులు వేచిచూసినా టీటీడీ నుంచి స్పందన లేదు. దాంతో విద్యుత్ సరఫరా ఆపివేశారు. దీంతో మళ్లీ కరకంబాడీ రోడ్డు అంధకారంలో ఉంటోంది. అటు స్థానికులు, ఇటు ఎస్పీడీసీఎల్ అధికారులు పలుమార్లు టీటీడీ విద్యుత్ విభాగానికి గుర్తు చేసినా పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీటీడీ కాంట్రాక్టు పనులకు సంబంధించి విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో నిధుల మంజూరులో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా భక్తుల సౌలభ్యం కోసం టీటీడీ యంత్రాంగం తక్షణమే స్పందించి వీధిలైట్లు వెలిగించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రత్యేక ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ


ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లా సమగ్ర శిక్ష, ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏలింకో) ఆధ్వర్యంలో ఎంజీఎం పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈఓ కేవీఎన్ కుమార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందన్నారు. పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించలేని వారికి ఇంటిదగ్గరే పాఠాలు నేర్పించే బాధ్యతను తీసుకుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు జిల్లాలో 3,600 మంది ఉన్నారని, వారికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలోనూ భవిత పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే వారికి అలవెన్సులు, రవాణా చార్జీలు కూడా ఇస్తున్నట్లు గుర్తు చేశారు. 421 మందికి ట్రై సైకిళ్లు, హియరింగ్ కిట్స్, వీల్‌ఛైర్లు, రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్ అందజేశారు. ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, ఇంక్లూసివ్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంజీఎం పాఠశాల హెచ్ఎం మునిశారద పాల్గొన్నారు.

రేపటి నుంచి భాష్యకార్ల ఉత్సవం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి మే 3వ తేదీ వరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు భాష్యకార్లను బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు పెద్ద మాడ వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం జరగనుంది. మే 1న భోగి తేరు, 2న శాత్తుమొర, 3న గంధంపొడి ఉత్సవం నిర్వహించనున్నారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చెంగల్‌పట్టు-కాచిగూడ మధ్య రాకపోకలు సాగించే కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు రేణిగుంట రైల్వే జంక్షన్‌లో రెండు రోజుల క్రితం పెను ప్రమాదం తప్పినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి చెంగల్‌పట్టు నుంచి కాచిగూడకు వెళుతున్న కాచిగూడ ఎక్స్‌ప్రెస్(17651) నిర్ణీత సమయానికి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. తిరిగి 8 గంటలకు బయలుదేరిన ఈ రైలు 5వ నంబరు ప్లాట్‌ఫారం నుంచి కడప వైపు వెళ్లాల్సి ఉంది. అయితే విజయవాడ మార్గంలోకి మళ్లింది. స్టేషన్ యార్డు దాటుతున్న సమయంలో డ్రైవర్ ఈ విషయాన్ని గ్రహించి రైలు నిలిపి స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు స్పందించి దారి తప్పిన రైలును తిరిగి 5వ నెంబరు ప్లాట్‌ఫారానికి రప్పించి, కడప మార్గం నుంచి పంపినట్లు తెలిసింది. ఈ కారణంగా బెంగళూరు-బాగల్‌పూర్, చెన్నై-ముంబయి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు ఆలస్యమయ్యాయి. దీనిపై వివరణ కోసం ప్రయత్నించగా అధికారులు స్పందించలేదు. కాగా, రైలు దారి తప్పిన సమయంలో విజయవాడ మార్గంలో మరో ఎక్స్‌ప్రెస్ వచ్చివుంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.

నర్సింగ్ విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న సూపరింటెండెంట్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనంతో చదువుకుని జిల్లా స్థాయిలోనే ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు నర్సింగ్ విద్యార్థులను అభినందించారు. రుయా అనుబంధమైన ఎంపీహెచ్ డబ్ల్యూ నర్సింగ్ శిక్షణా స్కూల్లో చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థి జె.జయంతి 90.5 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆర్.హేమలత 90.7 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. వారికి ఆయన చాంబర్‌లో సోమవారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నర్సింగ్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 22 మందికి 20 మంది, ద్వితీయ సంవత్సరంలో 17 మందికి 17 మంది జిల్లా స్థాయిలో ఉత్తీర్ణత సాధించడం చెప్పుకోదగ్గ విషయమన్నారు. నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

స్థలాలను కాజేశారు..న్యాయం చేయండి

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మూర్ఛవ్యాధితో బాధపడుతున్న తమ కుమారుడు గంగాధర్‌కు మాయమాటలు చెప్పి తమ స్థలాలను హేమలత కాజేసిందని ఎస్వీనగర్‌కు చెందిన విశ్రాంత ఎస్ఐ వెంకటరమణ, సతీమణి రాజేశ్వరి ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తమ కుమారుడితో హేమలత సాన్నిహిత్యం పెంచుకుని రూ.8 లక్షల డబ్బు తీసుకుందని ఆరోపించారు. తల్లిదండ్రులైన తమకు తెలియకుండా ఆస్తిపత్రాలు తెప్పించుకుని గంగాధర్ పేరుతో ఉన్న రేకుల ఇల్లు, స్థలం విక్రయించిందని తెలిపారు. అధికారులు, పాలకులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు


ఎస్పీ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ హర్షవర్ధన రాజు ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు రావడంతో కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. తనకు ప్రతిరోజూ నివేదికలు అందుతున్నాయని, సక్రమంగా విధులకు హాజరుకాకుండా రాజకీయాలు చేసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతినెలా మూడో శనివారం పరిసరాలను శుభ్రం చేసుకోవాలని చెప్పినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఇటీవల ఆధునికీకరించిన పోలీసు ఆస్పత్రిని పరిశీలించారు. వసతులపై అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ట్రైనీ ఎస్పీ హేమంత్, పోలీసు అధికారులు ఉన్నారు.

పందుల పెంపకం లాభదాయకం


విద్యార్థులతో డీన్ బ్రహ్మయ్య, ఏడీ జగపతి రామయ్య, హెడ్ విజయభాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం మరింత లాభదాయకంగా ఉంటుందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డీన్ డాక్టర్ కె.వీర బ్రహ్మయ్య తెలిపారు. వెటర్నరీ కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పందుల పెంపకంతో ఆదాయార్జన ప్రాజెక్టులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి బీవీఎస్సీ విద్యార్థులకు శిక్షణ నిర్వహించి సర్టిఫికెట్లు, చెక్కులు అందించారు. డీన్ మాట్లాడుతూ విద్యార్థిగా ఉంటూ చదువుతోపాటుగా పందుల పోషణ, యాజమాన్యం, ఆరోగ్యం, మార్కెటింగ్ వంటి అంశాలపై శాస్త్రీయ అధ్యయనం చేసి శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా 1969లో తిరుపతిలోని వెటర్నరీ కళాశాలలో ఈ ప్రోగ్రాంను ప్రారంభించి ఏటా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఎల్పీటీ హెడ్ డాక్టర్ జి.విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది శిక్షణ పూర్తి చేసుకున్న 22 మంది విద్యార్థులకు రూ.4,400 చొప్పున చెక్కులు, సర్టిఫికెట్లు అందించారు. అధ్యాపకులు డాక్టర్ సుధీర్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.



శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. దర్శకుడు గోపిచంద్ మలినేని, సంగీత దర్శకుడు తమన్, హీరో అశ్విన్‌బాబు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

నా పేరు యూనివర్స్



నా పేరు యూనివర్స్ రాజకీయపార్టీ పెడుతున్నా, మద్దతివ్వండి.. అని కోరుతూ సోమవారం ఉదయం తిరుపతిలోని ప్రకాశం పార్కు కూడలి వద్ద ఓ వ్యక్తి ఫ్లెక్సీతో నిలబడ్డారు. కోనసీమ ప్రాంతానికి చెందిన తాను రాజకీయ పార్టీ స్థాపించే నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రాథమికంగా ఈ చర్యకు పూనుకున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం నుంచి మొదలై రెండు వారాలుగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పర్యటించానన్నారు. ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,746

తలనీలాలు సమర్పించినవారు: 25,078





గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో తాబేళ్ల సంరక్షణ కేంద్రం





సముద్రంలోంచి తీరానికి వచ్చి ఇసుకలో గుంతలోడి ఇలా గుడ్లు పెట్టి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయి



ఆ గుడ్లను రాత్రి పూట సేకరిస్తారు



వాటిని సంరక్షణ కేంద్రంలో మళ్లీ గుంతలు తీసి పూడుస్తారు

సాగర పర్యావరణ నేస్తాలు



సముద్ర పర్యావరణాన్ని సమతల్యం చేసే ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పరిరక్షణకు ట్రీ ఫౌండేషన్ సంస్థ(చెన్నై), అటవీశాఖలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి.జిల్లాలో రెండు సంరక్షణ కేంద్రాల ద్వారా వీటిని కాపాడుతూ సంతోనోత్పత్తి వృద్ధికి దోహదపడుతున్నాయి. చిల్లకూరు మండలం గుమ్మళ్ళదిబ్బ, కోట మండలం శ్రీనివాససత్రం తీరప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలు ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్లను కంటికి రెప్పలా చూస్తూ సాగర పర్యావరణ హితానికి పాటుపడుతున్నాయి.

- గూడూరు,ఆంధ్రజ్యోతి



గుడ్లనుంచి పిగిలిన తాబేలు పిల్లలు వెళ్లిపోకుండా గంపలు కప్పి పెడతారు

ఇవీ విశిష్టతలు

- ఆలివ్‌రిడ్లే జాతి తాబేళ్లు సుమారు 100 నుంచి 180 ఏళ్ల వరకు జీవిస్తాయి.
- సుమారు 30 నుంచి 40 కేజీల వరకు పెరుగుతాయి.
- ఎక్కడ పుట్టి సముద్రంలోకి వెళతాయో.. తిరిగి అక్కడికే చేరుకుని గుడ్లు పెట్టడం వీటి విశిష్టత.
- సముద్రంలో సుమారు 2000 కిలోమీటర్లు సంచరిస్తుంటాయి.
- గుడ్లు పెట్టే సమయానికి గుంపులుగా తీరంలో తాము పుట్టిన చోటుకు చేరుకుంటాయి.
- రాత్రి వేళ్ల ఒకటిన్నర అడుగు లోతు మేర గుంటను తవ్వుకుని గుడ్లను పెట్టి తిరిగి సముద్రంలోకి వెళతుంటాయి.
- వీటి గుడ్లు 20-35 డిగ్రీల ఉష్ణోగ్రతను మాత్రమే తట్టుకోగలుగుతాయి.
- పుట్టినపుడు 50 గ్రాముల వరకు వుంటుంది.
- ఆడ తాబేలు 12 నుంచి 15 ఏళ్ల వయసులో గుడ్లు పెట్టడం మొదలుపెడతాయి.



● ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ట్రీ ఫౌండేషన్, అటవీశాఖల సమష్టి కృషి

వ్యర్థపదార్థాల వల్ల సముద్రం కలుషితంగా మారుతుంది. దీంతో ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయి. తాబేళ్లు ఈ వ్యర్థపదార్థాలను, లోపలి ఇతర మొక్కలను, పాచిని తింటూ సాగర జలం కలుషితం కాకుండా చూస్తున్నాయి. ఇవి సముద్ర అడుగు భాగాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. దీంతో పలు రకాల చేపలు పరిశుభ్ర వాతావరణంలో తిరుగుతూ సంతాన ఉత్పత్తిని పెంచుకుంటాయి. చిన్నపాటి చేపల జాతులను నాశనం చేసే జెల్లీఫిష్‌లను తాబేళ్లు అంతమొందిస్తున్నాయి. ఫలితంగా ఆ జాతులు కూడా వృద్ధి చెందుతున్నాయి.

తాబేళ్ల పిల్లల పరిరక్షణ

సాగర పర్యావరణ మిత్రులుగా నిలుస్తున్న తాబేళ్ల సంరక్షణకు,వృద్ధికి ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ సంయుక్తంగా పాటుపడుతున్నాయి.ఇందులో భాగంగా స్థానిక మత్స్యకారులకు శిక్షణ ఇచ్చి సీ టర్టిల్ ప్రొటక్షన్ ఫోర్స్‌గా నియమిస్తున్నాయి. ఈ సిబ్బంది సముద్ర తీరంలో తాబేలు గుడ్లు పెట్టిన చోటును గుర్తిస్తారు. తాబేలు సగటున 80 నుంచి 160 వరకు గుడ్లను పెడుతుంది. వీటిని గుడ్డసంచులలో సేకరించి తాబేలు సంరక్షణ కేంద్రానికి తీసుకువస్తారు. తీరాన ఎంత లోతు, విస్తీర్ణంలో గుడ్లను పెడుతుందో అదేవిధంగా కేంద్రాల్లో తాత్కాలిక గూళ్లను ఏర్పాటు చేసి సంరక్షిస్తారు. 48 నుంచి 52 రోజుల తరవాత గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. 35 డిగ్రీలు కంటే ఎక్కువ ఉష్ణోగ్రత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. 30 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువ శాతం మగ తాబేళ్లు, 30 నుంచి 33 డిగ్రీల సమయంలో ఆడ తాబేళ్లు పుడతాయి. పుట్టగానే భద్రంగా వీటిని తీసుకువెళ్లి సముద్రంలోకి వదులుతుంటారు. గత ఏడేళ్లలో గుమ్మళ్లదిబ్బ తీరంలో ఇలా 3685, శ్రీనివాసత్రం నుంచి 1500కి పైగా తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలారు. సాధారణంగా ఆలీవ్ రిడ్లే జాతి తాబేళ్లు నవంబరు నుంచి మార్చి వరకు గుడ్లు పెడుతాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సంరక్షణా కేంద్రాల్లో పిల్లలను సముద్రంలోకి వదులుతుంటారు.





తాబేలు పిల్లలను తిరిగి సముంద్రంలోకి వదులుతారు



మళ్లీ మళ్లీ వాళ్లే..!

● ఎస్పీ కార్యాలయానికి వచ్చినా క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు

● సీఐలు, ఎస్ఐల వద్ద పేరుకుపోతున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయానికి వెళితే సమస్య పరిష్కారం అవుతుంది. ఇదీ చాలామందిలో ఉన్న నమ్మకం. దీనికోసం ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వ్యయప్రయాసలకు ఓర్చి అర్జీదారులు వస్తున్నారు. ఇక్కడ్నుంచి ఆయా స్టేషన్లకు పంపితే.. మళ్లీ సమస్య మొదటికే వస్తోంది. దీంతో మళ్లీ మళ్లీ వీరంతా తిరుపతికే రావాల్సి వస్తోంది. జిల్లా పోలీసు కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ.. అన్నింటినీ పరిష్కరించే దిశగా ఎస్పీ హర్షవర్ధనరాజు వినూత్న ఆలోచన చేశారు. ఇక్కడ ఫిర్యాదులు పరిశీలించి ఎవరి పరిధి? ఎక్కడకు పంపాలి? ఎందుకు పరిష్కారం కాలేదు అని తెలుసుకోవడానికి ప్రతి వారం ఇద్దరు అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, సిబ్బంది పాల్గొనేలా చర్యలు చేపట్టారు. కానీ, తదనుగుణంగా ఫిర్యాదుల పరిష్కారంలో కొంతమంది అధికారులు చొరవ చూపక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు ఇటీవల అదనపు ఎస్పీ క్రైం నాగభూషణం వద్దకు ఒక మహిళ ఫిర్యాదు తీసుకొచ్చారు. దీనిని పరిశీలించిన ఆయన గత వారం వచ్చావు కదమ్మా..మళ్లీ ఎందుకు వచ్చావని అడిగారు. 'సార్ మీరు సీఐ వద్దకు వెళ్లమన్నారు. అక్కడకు వెళితే రిసెప్షన్‌లో కూర్చున్న పోలీసు సార్ ఒకాయన నన్ను సీఐ వద్దకు పంపడంలేదు. సార్ బిజీగా వున్నారు? రేపు రండి ఎల్లుండి రండి అన్ని తిప్పారు. అందువల్లే మళ్లీ వచ్చాను సార్' అని ఆవేదన వ్యక్తం చేశారామె. చాలా పోలీసు స్టేషన్లలో జరుగుతున్న తంతు ఇదే. దీంతో ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. కాగా, ఎస్పీకి నివేదికలు సమర్పించే క్రమంలో కొందరు తప్పుడు వివరాలు అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారులను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐలు

పోలీసు పీజీఆర్ఎస్‌కు 104 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాయంలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు 104 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. తొమ్మిది మంది సీఐల వద్దకు ఫిర్యాదుదారులు వెళ్లి సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. అక్కడ నుంచి ఎస్పీ వద్దకు వెళ్లారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, సీఐలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చునని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టర్‌లో సోమవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పోస్టర్లు, బ్యానర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్ల మలేరియా అధికారి రూప్‌కుమార్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పెండింగ్ పనులను వేగవంతం చేయాలి

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన ఏడు గ్రామాల్లో భూసేకరణ, రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రవి నాయుడు, డీఎస్సీ అభ్యర్థులు

ఆరేళ్ల కల నిజమాయె

డీఎస్సీపై చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తిరుపతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ అభ్యర్థుల ఆరేళ్ల కలను సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ సాకారం చేశారని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందన్నారు. డీఎస్సీ విడుదల సందర్భంగా తిరుపతి ఆర్డీవో ఆఫీసు ఎదుట డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి సోమవారం చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 'థ్యాంక్యూ సీఎం సర్, లోకేశ్ అన్న' అంటూ డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. రవినాయుడు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. అన్ని కేటగిరీలకు న్యాయం జరిగేలా ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ డీఎస్సీ విడుదల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని, చెప్పినట్టుగానే 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రాష్ట్ర సభ్యులు ఆర్కే నాయుడు, విష్ణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ క్యాంపు

తిరుపతి(విద్య), ఏప్రిలల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రత్యేక మెడికల్ క్యాంపును తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్ 2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ పొందాల్సిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా మెడికల్ క్యాంపునకు హాజరుకావాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు రుయా ఆసుపత్రిలో పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి, సంబంధిత వైద్యులతో పరిశీలన చేయించుకుని కొత్త సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. వీటి ఆధారంగానే బదిలీల్లో ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

వాచీల ఈ-వేలం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను మే 1, 2 తేదీల్లో ఈ-వేలం నిర్వహించనున్నారు. టైటాన్, సిటిజన్, సొనాట, రాగా, టైమ్స్, టైమెక్స్ ఇతర కంపెనీల స్మార్ట్ వాచీలు 62 లాట్లు కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్నవి ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని మార్కెటింగ్ కార్యాలయం 0877- 2264429, టీటీడీ వెబ్‌సైట్, రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్‌ను సంప్రదించాలని టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

టీడీపీ నేతపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

రుయాలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌కు శాప్ చైర్మన్ పరామర్శ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలపై దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతున్న వైసీపీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న 1వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్‌ను సోమవారం టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీ యూఎఫ్ఐడీసీ చైర్మన్ వూకా విజయ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్ అండదండలతో వైసీపీ నేతలు దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టీడీపీ నేతలను భయభ్రాంతులకు గురిచేయాలనే ఆలోచనతోనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. వైసీపీ దాడులకు, బెదిరింపులకు టీడీపీ నేతలు భయపడరని స్పష్టం చేశారు. నరసింహయాదవ్, మునికృష్ణ మాట్లాడుతూ ప్రశాంతమైన తిరుపతిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రుయాకు చేరుకొని వెంకటేష్‌ను పరామర్శించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు శంకర నారాయణ పాల్గొన్నారు.



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న రవినాయుడు, టీడీపీ నేతలు

రెండు మోటర్ సైకిళ్ల ఢీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



మృతి చెందిన మస్తాన్

ఓజిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గూడూరుకు చెందిన మస్తాన్(40) మృతి చెందగా, అదే మండలంలోని లింగసముద్రం గ్రామానికి చెందిన సుధీర్, ప్రవీణ్ కుమార్ గాయపడ్డారు. ఓజిలి ఏఎస్ఐ గురుమూర్తిరాజు కథనం మేరకు... పెద్దపరియ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఓ తారు ప్లాంటులో గూడూరుకు చెందిన మస్తాన్ డ్రైవర్, వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి మండలంలోని రాజుపాళెం గ్రామానికి మోటరు సైకిల్‌పై వెళ్లి తిరిగి రాంగ్ రూట్‌లో వస్తుండగా లింగసముద్రం గ్రామానికి చెందిన సుధీర్, ప్రవీణ్ కుమార్ మోటర్ సైకిల్‌పై వెళ్తూ పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిని సుధీర్, ప్రవీణ్‌కుమార్‌ను 108 వాహనంలో గూడూరు ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో టైలర్ మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో టైలరింగ్ దుకాణం నిర్వహిస్తున్న విజయమోహన్(34) నాయుడుపేటలోని తన దుకాణానికి వచ్చాడు. అయితే రాత్రి ఇంటికి వెళ్లలేదు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామానికి చెందిన విజయ మోహన్ నాయుడుపేట పట్టణంలో టైలరింగ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం చెంబేడు నుంచి దుకాణానికి వెళ్లాడు. అయితే రాత్రి ఇంటికి వెళ్లలేదు. సోమవారం ఉదయం తిమ్మాజికండ్రిగ చెరువులో విజయమోహన్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ బాబి పరిశీలించారు. విజయమోహన్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వా స్పత్రికి తరలించారు. మృతుడి బట్టలు చెరువు గట్టుపై లభ్యమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తులను పరిరక్షించేందుకే వక్ఫ్ చట్టం



వక్ఫ్ ఆస్తులపై అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సమాజానికి సంబంధించిన ఆస్తులను పరిరక్షించేందుకే వక్ఫ్ చట్టం ఉందని సీపీఎం నాయకుడు జోగి శివకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పెద్దమసీదు, మున్సిపల్ కార్యాలయం, మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో వక్ఫ్ ఆస్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం పార్లమెంటులో ఆమోదం పొందిన తీరు ముస్లింలలో తీవ్ర ఆందోళనకు దారితీసేవిధంగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వం ఈ తరహా విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీవీ రమణయ్య, జంషద్ అహ్మద్, శంకరయ్య, గౌతమ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న మయూరి శ్యామ్‌యాదవ్

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం తిరుపతిలో రాష్ట్ర అబ్జర్వర్, డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్, రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా మయూరి శ్యామ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, మల్లికార్జున, కార్యదర్శిగా చెంచయ్య, జాయింట్ సెక్రటరీలుగా రమేష్, రాంబాబు, టిజరర్‌గా మహేష్, సభ్యులను ఎన్నుకున్నారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చెంగల్‌పట్టు - కాచిగూడ మధ్య రాకపోకలు సాగించే కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు రేణిగుంట రైల్వే జంక్షన్‌లో రెండు రోజుల క్రితం పెను ప్రమాదం తప్పినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి చెంగల్‌పట్టు నుంచి కాచిగూడకు వెళుతున్న కాచిగూడ ఎక్స్‌ప్రెస్(17651) నిర్దేత సమయానికి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. తిరిగి 8 గంటలకు బయలుదేరిన ఈ రైలు 5వ నంబరు ప్లాట్‌ఫారం నుంచి కడప వైపు వెళ్లాల్సి ఉంది. అయితే విజయవాడ మార్గంలోకి మళ్లింది. స్టేషన్ యార్డు దాటుతున్న సమయంలో డ్రైవర్ ఈ విషయాన్ని గ్రహించి రైలు నిలిపి స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు స్పందించి దారి తప్పిన రైలును తిరిగి 5వ నెంబరు ప్లాట్‌ఫారానికి రప్పించి, కడప మార్గం నుంచి పంపినట్లు తెలిసింది. ఈ కారణంగా బెంగళూరు - బాగల్‌పూర్, చెన్నై-ముంబయి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు ఆలస్యమయ్యాయి. దీనిపై వివరణ కోసం ప్రయత్నించగా అధికారులు స్పందించలేదు. కాగా, రైలు దారి తప్పిన సమయంలో విజయవాడ మార్గంలో మరో ఎక్స్‌ప్రెస్ వచ్చివుంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.

ఎస్పీ కార్యాలయంలో తనిఖీలు



ఎస్పీ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ హర్షవర్ధన రాజు ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు రావడంతో కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. తనకు ప్రతిరోజూ నివేదికలు అందుతున్నాయని, సక్రమంగా విధులకు హాజరుకాకుండా రాజకీయాలు చేసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతినెలా మూడో శనివారం పరిసరాలను శుభ్రం చేసుకోవాలని చెప్పినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఇటీవల ఆధునికీకరించిన పోలీసు ఆస్పత్రిని పరిశీలించారు. వసతులపై అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు.

అగ్రిటెక్‌పై నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కాలేజీలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ రమణ వెల్లడించారు. వ్యవసాయ సాంకేతికత - ఆహార భద్రత అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేత్రదానం



అమరేంద్రరెడ్డి (ఫైల్‌ఫొటో)

తడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెండ్లూరుపాడు గ్రామానికి చెందిన వేనాటి అమరేంద్రరెడ్డి(53) సోమవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయకు దానం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అలపాటి అశోక్, ఎంఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

దొరవారిసత్రం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావిళ్లపాడు మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు సోమవారం ముగిశాయి. ఆదివారం, సోమవారం రెండు రోజులు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 113 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 104 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు.

ప్రతి ఎకరానికీ 'గంగ': విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు తెలుగుగంగ నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో తెలుగుగంగ అధికారులు, రైతులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో రెండో పంటకు సాగునీటి అవసరం ఉందని, నియోజకవర్గంలో పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాలకు 7 బ్రాంచ్ కెనాల్, 8 ఏ, 8బి బ్రాంచ్ కాలువలకు గంగనీటిని విడుదల చేసి సాగుకు నీరందిస్తామన్నారు. కండలేరు నుంచి నీరొచ్చే సత్యసాయి తెలుగు గంగ కెనాల్ మరమ్మతులు చేస్తున్న కారణంగా నీటి విడుదల ఆలస్యమైందన్నారు. మే 5న గంగనీటిని విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నామని, దిగువ చివరి భాగంలో ఉన్న భూములకు సైతం సాగునీరు అందుతుందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరు అందించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చొరవతో రూ.470 కోట్లు మంజూరయ్యాయని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. సమావేశంలో తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణమూర్తి, డీఈలు శ్రీనివాసులు, గజేంద్రరెడ్డి, ఏఈలు రాజేష్, గోపికృష్ణ, హరీష్, టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, ఏజీ కిషోర్, కామిరెడ్డి మురళీరెడ్డి, వేనాటి రాజారెడ్డి, సంచి కృష్ణయ్య, విజయ నాయుడు, నీటి సంఘ అధ్యక్షుడు రమణయ్య, వెంకరమణ తదితరులు పాల్గొన్నారు.



గంగనీటి గురించి ఎమ్మెల్యే విజయశ్రీకి వివరిస్తున్న ఈఈ రాధాకృష్ణమూర్తి, పక్కన మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శివశంకర్

దక్కిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని కంథలవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకొంటమాని హెచ్చరించారు. ఇక మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే డ్రైవర్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనం నడిపేటప్పు డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ఇతర పత్రాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

వేరుశనగ పంటకు పరిహారం



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

కోట, ఏప్రిల్ 21: కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాసత్రం ప్రాంతంలో వేరుశనగ పంట సాగు చేసిన రైతులకు పరిహారం అందించారు. కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాసత్రం వద్ద చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌కు ఇచ్చిన భూముల్లో రైతులు వేరుశనగ సాగు చేశారు. పంట దిగుబడి తీసుకునేందుకు వ్యవధి కావాలని కోరుతూ రైతులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జయజయరావు రైతులు సాగు చేసిన వేరుశనగ పంట ఎకరానికి రూ.15వేలను సోమవారం రైతులకు చెల్లించారు. దీంతో రోడ్డు పనులు చేపట్టేందుకు రైతులు అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సన్మానం



పీరకుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ పీరకుమార్ ఇటీవల కందుకూరి రంగస్థల పురస్కారం అవార్డును అందుకోవడంతో సోమవారం కళాశాలలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ పీరకుమార్ అధ్యాపకుడిగా పనిచేస్తూ వివిధ నాటక పరిషత్‌లలో పాల్గొని నటుడిగా ప్రతిభచూపుతూ, రచయతగా రాణిస్తున్నాడని కొనియాడారు. ఆయన ప్రతిభను గుర్తించిన హైదరాబాదుకు చెందిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ సంస్థ గతంలో ఆయనకు నంది అవార్డును అందించడం జరిగిందన్నారు. ఈనెల 16వ తేదీన కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం పీరకుమార్‌కు కందుకూరి రంగస్థల ప్రతిష్టాత్మక విశిష్ట పురస్కారాన్ని అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, కోటేశ్వరరావు, విజయ్‌మహేష్, ఝాన్సీరాణి, సురేంద్ర, శైలజ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

తిన్నెలపూడిలో క్యాన్సర్ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కోట, ఏప్రిల్ 21: మండల పరిధిలోని తిన్నెలపూడిలో తిరుపతిలోని వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హరిత, డాక్టర్ నాగరాజు మహిళలకు రొమ్ము, నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. పలువురికి మమోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆధ్వర్యంలో తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, చెంబుడిపాళెం గ్రామాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

28నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న రామకృష్ణమిషన్ ఆశ్రమంలో ఈనెల 28నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు 'సంస్కార శిబిరం' పేరిట పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ ప్రతినిధి శ్రీకాంత్ మహరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాసనాలు, ఆర్ట్స్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్, భజనలు, సంస్కృత శ్లోకాలు, శ్రీమద్ భగవద్గీత, పూలమాల తయారీ విధానం, భారత సనాతన సంస్కృతి, కర్రసాము, విలువిద్య, వ్యక్తిత్వవికాసం వంటి వాటిలో ఉదయం 8.15నుంచి మధ్యాహ్నం 12.15వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 5 నుంచి 10 వ తరగతి బాలబాలికలు మాత్రమే అర్హులని వివరించారు. ముందు వచ్చినవారికి ముందు ప్రాధాన్యత ప్రాతిపదికన పేర్లను నమోదు చేసుకుంటారని, పూర్తిగా శ్వేత వస్త్రధారణతో రావాల్సి ఉంటుందని వెల్లడించారు. రూ.1,200 రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఉదయం ఉపాహారం అందజేస్తారని, మరిన్ని వివరాలకు 9493107001, 6360150945లను సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి భాష్యకార్ల ఉత్సవం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆల యంలో ఈనెల 23 నుంచి మే 3వ తేదీ వరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు భాష్య కార్లను బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు పెద్ద మాడ వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం జరగనుంది. మే 1న భోగి తేరు, 2న శాత్తుమొర, 3న గంధంపొడి ఉత్సవం నిర్వహించనున్నారు.

డయాలసిస్ కేంద్రం నిర్వాహకులపై విచారణ చేపట్టాలి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం నిర్వాహకులపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ సోమవారం కోరారు. మండలంలోని అయ్యవారిపాళెం గ్రామానికి చెందిన నారాయణమ్మ గత కొన్ని సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకుంటోందన్నారు. అయితే గత మంగళవారం డయాలసిస్ చేస్తుండగా ఆమె చనిపోయిందన్నారు. దీనిపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి మృతి గల కారణాలను తెలియజేసి బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేయాలన్నారు.

ప్రతి గిరిజనుడికీ ఆధార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపి

కోట, ఏప్రిల్ 21: మండలంలో ప్రతి గిరిజనుడికీ ఆధార్ కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గోపి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులతో సమీక్ష జరిగింది. మండలంలోని 21 పంచాయతీల్లో 7860 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారని, వారందరికీ తప్పనిసరిగా ఆధార్ ఉండేలా చూడాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలని, ఎక్కడైనా లోపాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ వేణు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు

పెళ్లకూరు, ఏప్రిల్ 21: మండలంలోని నవటకండ్రిగ వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ బుక్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మునిస్వామి, కానిస్టేబుల్ గోపి పాల్గొన్నారు.

పందుల పెంపకం లాభదాయకం

తిరుపతి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం మరింత లాభదాయకంగా ఉంటుందని ఎస్వీ వెటర్నరీ వర్శిటీ డీన్ డాక్టర్ కె.వీర బ్రహ్మయ్య తెలిపారు. వెటర్నరీ కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పందుల పెంపకంతో ఆదాయార్జన ప్రాజెక్టులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి బీవీఎస్సీ విద్యార్థులకు శిక్షణ నిర్వహించి సర్టిఫికెట్లు, చెక్కులు అందించారు. డీన్ మాట్లాడుతూ విద్యార్థిగా ఉంటూ చదువుతోపాటుగా పందుల పోషణ, యాజమాన్యం, ఆరోగ్యం, మార్కెటింగ్ వంటి అంశాలపై శాస్త్రీయ అధ్యయనం చేసి శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా 1969లో తిరుపతిలోని వెటర్నరీ కళాశాలలో ఈ ప్రోగ్రాంను ప్రారంభించి ఏటా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఎల్పీటీ హెడ్ డాక్టర్ జి.విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది శిక్షణ పూర్తి చేసుకున్న 22 మంది విద్యార్థులకు రూ.4,400 చొప్పున చెక్కులు, సర్టిఫికెట్లు అందించారు. అధ్యాపకులు డాక్టర్ సుధీర్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన జాతీయ రహదారిపై పోటుపాళెం కూడలి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... తెలంగాణ నుంచి మిర్చి లోడుతో చెన్నై వెళుతున్న లారీ పోటుపాళెం కూడలి వద్ద రోడ్డు పక్కన ఆగింది. గోదావరి జిల్లా నుంచి ధాన్యం లోడుతో కేరళ వెళుతున్న మరో లారీ అదుపుతప్పి ఆగిఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ధాన్యం లారీ డ్రైవర్ ప్రకాష్, క్లీనర్ శ్యామ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ లారీలో ఇరుక్కుపోయిన ప్రకాష్, శ్యామ్‌లను బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. రోడ్డుపై పడినపోయిన లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి



వెంకటరమణయ్య దంపతులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కోట, ఏప్రిల్ 21: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈవో దారా మస్తానయ్య అన్నారు. మండల పరిధిలోని గూడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవి విరమణ చేసిన బట్టా వెంకటరత్నం అభినందన సభ సోమవారం జరిగింది. హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘ నేతలు వెంకటరత్నం దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు మనోహర్, నుమాయిష్, తూపిలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలి



తిన్నెలపూడిలో ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

కోట, ఏప్రిల్ 21: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ పెంచుకోవాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. మండల పరిధిలోని తిన్నెలపూడిలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ప్రతినిధుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఇంటింటా తిరిగి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు పెట్టుబడుల కోసం పొదుపు సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయాధికారి దినేష్, ఎఫ్‌టీవో శంకర్, మోడల్ మేకర్ శ్రీనివాసులు, పద్మ, శివకుమారి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఎనిమిది గేదెల మృతి

పెళ్లకూరు ఏప్రిల్ 21: వాహనం ఢీకొని ఎనిమిది గేదెలు మృతిచెందిన ఘటన సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... టెంకాయతోపు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున గేదెలు రోడ్డు దాటు తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది గేదెలు మృతి చెందాయి. కేసు నమోదు చేశామని, మృతి చెందిన గేదెల కోసం ఎవ్వరూ రాలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్ ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ ప్రారంభించారు. కాగా, మూడేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరుడు కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను అద్దెకు తీసుకున్నాడు. రూ.5 లక్షల అద్దె ఎగ్గొట్టి ఖాళీ చేసి వెళ్లాడు. అధికారులు అతడికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

ఏఐతో ఎన్నో ప్రయోజనాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏఐతో ఎన్నో రకాల ప్రయోజనాలున్నాయని ఎస్వీయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసయ్య తెలిపారు. పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పారదర్శకంగా ఏఐని వాడితో మంచి ఫలితాలున్నాయన్నారు. మేధావులు, సాంకేతిక నిపుణుల మధ్య సమన్వయంతో ఏఐని ప్రయోజనకారిగా మార్చవచ్చని అన్నారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు వెంకటకృష్ణ ఏఐ టెక్నాలజీతో ఏర్పడే సమస్యలకు తగిన పరిష్కారాలు కనుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, దుద్యాల చంద్రమోహన్, ప్రొఫెసర్ త్రిపురసుందరి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదలపై హర్షం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ విడుదల పట్ల టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత హర్షం తెలిపాయి. ఎస్వీయూలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చిత్రాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు శేషాద్రినాయుడు, రామ్మోహన్, ఆర్కే నాయుడు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలకు ఆర్టీసీ బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఆర్టీసీ డిపోకు సంబంధించి నూతనంగా వచ్చిన సత్యవేడు - తిరుమల బస్సుకు సోమవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద డిపో డీఎం వెంకటరమణ, టీడీపీ నాయకులతో కలిసి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉందన్నారు. ప్రతి రూట్లో నిర్దేశించిన సమయానికి బస్సులను నడపడానికి ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రేపల్లెవాడ, రాజగోపాలపురంలో నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బాషా, చిన్న, పీఎస్ఆర్, జె.శివానందం, రాధాకృష్ణ, శశి, గణేష్, జనసేన రూపేష్, తహసీల్దార్ రాజశేఖర్, సీఐ మురళి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్ల ప్రారంభంపై ఎమ్మెల్యే ఆగ్రహం

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, భూమిపూజల్లో నియోజకవర్గానికి సంబంధంలేని నాయకులు పాల్గొనడం ఏమిటని ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రాజగోపాలపురంలో రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును టీడీపీ నియోజక వర్గ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు, ఎన్నికల పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు ఆదివారం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇది మండలంలో వివాదానికి దారితీసింది. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఈ విషయమై మీడియాతో మాట్లాడుతూ... తనకు తెలియకుండా ప్రారంభించడం దేనికి సంకేతమన్నారు. నియోజక వర్గంలో వర్గపోరు రాజకీయాలకు స్వస్తి పలకకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అధికారులు, మీడియా ప్రోటోకాల్ మేరకు వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు.

టీపీకోట - సత్యవేడు రోడ్డు బాగుచేయండి: సీపీఎం



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు - టీపీకోట రోడ్డును బాగు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో కన్నవరం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. సోమవారం రోడ్డుపై నిలబడి రోడ్డు బాగు చేసి తమ కష్టాలు తీర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ టీపీకోట - సత్యవేడు రోడ్డు గత నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోక ప్రజలు నానాకష్టాలు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం గుంతలు తేలిన రోడ్లపై కనీసం తట్టమట్టి కూడా పోయకుండా పుణ్యకాలం గడిపేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న కార్మికులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు ప్రతిరోజు గాయాలపాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టీపీకోట రోడ్డును బాగు చేయాలని కోరారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సంఘ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని టీడీపీ బీసీ విభాగ నాయకులు కొనియాడారు. సోమవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పతరువుగా సీఎం మారారన్నారు. 16,347 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసి ఎంపికైన అభ్యర్థులకు రెండు నెలల్లో పోస్టింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గత వైసీపీ హయాంలో 6,100 డీఎస్సీ పోస్టులు ప్రకటించి నోటిఫికేషన్ విడుదలైన 30 రోజుల్లోనే పరీక్షలంటూ మెలిక పెట్టిన ఘనుడు మాజీ సీఎం జగన్ అన్నారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వన్నియకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, టీడీపీ బీసీ విభాగం నాయకులు ఉమేష్‌రావు, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా రైతు ఉత్పత్తి సంఘాల సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): క్రమం తప్పకుండా రైతు ఉత్పత్తి సంఘాల సమావేశాలు నిర్వహించాలని రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య జిల్లా ఏపీఎం ద్రాక్షాయణి తెలిపారు. వెలుగు కార్యాలయంలో చిన్న, సన్నకారు మహిళా రైతులతో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాలు సక్రమంగా పొదుపు చేసుకుంటూ చిన్న చిన్న అవసరాలకు విత్తనాలు, ఎరువులు కోసం తక్కువ వడ్డీతో రుణం పొందవచ్చన్నారు. ఉత్పత్తి అయిన పంటను నిల్వ ఉంచి గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహకంగా 30 సంఘాలకు మొదటిగా రూ.10వేలు చొప్పున మంజూరు చేస్తున్నామన్నారు. ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి, ఏపీఎం మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అంగన్‌వాడీ హెల్పర్లకు నియామకపత్రాల అందజేత


నియమితులైన సిబ్బందితో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, 21 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం, పోషణ, 6 సంవత్సరాల లోపు పిల్లల అభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. సోమవారం పుత్తూరు పట్టణం, మండలం, వడమాలపేట పరిధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసేందుకు ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్త, 9మంది సహాయకులకు ఎమ్మెల్యే నియామక ఉత్తర్వులు అందజేశారు. విధుల్లో నిబద్ధతగా వ్యవహరించాలని వారికి సూచించారు. మధ్యాహ్న భోజనంతో పాటు వారానికి 4 కోడిగుడ్లను, పౌష్టికాహారాన్ని సకాలంలో అందజేయాలన్నారు. ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణం

వడమాలపేట, 21 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22న మంగళవారం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ప్రారంభమవుతుందని చెప్పారు. భక్తులు రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చన్నారు. టిక్కెట్లు తీసుకొన్న గృహస్తులకు ఉత్తరీయం, రవికె, అప్పం, తీర్థప్రసాదాలు అందిస్తామన్నారు.

విద్యార్థులకు ఉచిత ధ్యాన శిబిరం

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పిరమిడ్ స్పిరిచ్యుయల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు సహకారంతో మే 1వ తేది నుంచి 11 వరకు త్రినేత్ర పిరమిడ్ ఆవరణలో సమ్మర్ ఉచిత క్యాంపులో ధ్యానం, యోగ భగవద్గీత, సంగీతం, పెయింటింగ్, క్విజ్, పాటలు, ప్రత్యక్ష అనుభవ జ్ఞానాన్ని పెంపొందించుట వంటి అంశాలపై నిష్ణాతులచే శిక్షణ ఇప్పిస్తామని ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. 10-17 సంవత్సరాల పిల్లలు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం నెం.9885465689లో సంప్రదించాలని కోరారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

రేపు మండల సర్వసభ్య సమావేశం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 23న బుధవారం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

వంతెన నిర్మాణం కలేనా...?

● ఏళ్లుగా ఎదురుచూస్తున్న జయలక్ష్మీపురంవాసులు



కాళంగి ఏరుపై ఉన్న మట్టి వంతెన - వర్షాకాలంలో పొంగిపొర్లుతున్న కాళంగి యేరు(ఫైల్ ఫొటో)

కేవీబీపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టచివరి గ్రామమైన జయలక్ష్మీపురం వాసుల వంతెన నిర్మాణ ఆశలు కలగానే మిగిలిపోయాయి. 'ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికి వెళ్లేందుకు కాళంగి ఏరుపై వంతెన నిర్మిస్తామని నాయకులు, ప్రజాప్రతినిధులు వాగ్దానాలు చేస్తూనే ఉన్నారు.. ఇప్పటికీ ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారు... తప్ప నిర్మాణానికి ముందుకు వచ్చి పనులు ప్రారంభించే పరిస్థితి కనబడటంలేదు' అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే ఏరు పొంగి కనీసం ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. దీనికి తోడు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయని వాపోయారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోగగ్రస్తులు ఇతర గ్రామాలకు వెళ్లే పరిస్థితి ఏ మాత్రం ఉండదు. ఏరు తగ్గిన తరువాత మొలలోతు నీటిలోనే దాటాల్సి ఉంది. యేటా వర్షాలు కురవడం... బయట గ్రామాలతో సంబంధాలు తెగిపోవడం పరిపాటిగా మారిందని, ఆ సమయాల్లో ఏరు తగ్గిన తరువాత గ్రామంలోకి నాయకులు వచ్చి వంతెన నిర్మిస్తామని హామీలతోనే సరిపెడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం అయినా స్పందించి కాళంగి ఏరుపై వంతెన నిర్మించి తమ బాధలను తీర్చాలని జయలక్ష్మీపురం వాసులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలు

కేవీబీపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పెరిందేశానికి చెందిన సత్య(38) కాత్రపల్లికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈక్రమంలో అదుపుతప్పి పాఠశాల ప్రహరీని ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని వెంటనే అంబులన్సు ద్వారా చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం

కేవీబీపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి గ్రామానికి చెందిన వాసుదేవ మాదిగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో సత్యవేడు నియోజకవర్గ యువత సోమవారం ఆయన్ను సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 సంవత్సరంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను జిల్లా కార్యదర్శిగా, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేశానన్నారు. తన సేవలను గుర్తించి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఉపాధ్యక్షుడిగా నియమించారన్నారు. మాదిగల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. మస్తాన్ మాదిగ, పురుషోత్తం, వెంకటకృష్ణయ్య, లోకేష్, రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో త్రిపుర గవర్నర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం త్రిపుర గవర్నర్ ఎన్ ఇంద్రసేనారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఈవో బాపిరెడ్డి, వేద పండితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నరసింహయాదవ్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్‌ను సోమవారం జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత తిరుపతిలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇటీవల ఆయన యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఈ సన్మానం చేశారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీ కాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులిచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు, మహా మంగళ హారతులు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పాఠశాల విలీనం వద్దు

● రోడ్డెక్కిన కాటూరువాసులు


కేటీ రోడ్డుపై రాస్తారోకోలో కాటూరువాసులు

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని 6, 7, 8 తరగతులు విలీనంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం కాటూరులోని శ్రీకాళహస్తి - తడ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలలోని 6, 7, 8 తరగతులను పల్లమాల ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నా మన్నారు. తమ గ్రామం నుంచి పల్లమాల పాఠశాలకు చేరుకోవాలంటే సుమారు 5 కిలోమీటర్ల దూరం ఉందని తమ పిల్లలను అక్కడకు పంపమని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రుల రాస్తారోకో వల్ల ట్రాఫిక్ నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు సిబ్బందితో వెళ్లి కాటూరు వాసులను సముదాయించారు. అనుమతులు లేకుండా రాస్తారోకో చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. దీంతో రాస్తారోకో విరమించారు.

రేణిగుంటలో...



రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులను మరో పాఠశాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం ముస్లిం, మైనార్టీ మత పెద్దలు ఎంపీడీవో విష్ణు చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానిక ఉర్దూ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 35 మంది చదువుకుంటున్నారన్నారు. నూతన జీవో ప్రకారం ఇక్కడ చదువుతున్న విద్యార్థులను పక్కనే ఉన్న ఎలిమెంటరీ స్కూలుకు ఉర్దూ పాఠశాల కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. స్పందించిన ఎంపీడీవో సమస్యను ఎంఈవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు మునీర్ రహంతుల్లా, జాకీర్, హుస్సేన్, జిలాని తదితరులు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా చూస్తామని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని నెలవాయి, కల్లివెట్టు పంచాయతీల్లోని గాంధీ గిరిజన కాలనీ, కారణి గ్రామంలో సోమవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 1వ తరగతిలో చేరాల్సిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. అదే విధంగా 6వ తరగతిలో వెళ్లాల్సిన వారిని సమీపంలోని హైస్కూల్‌లో చేర్చారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. నెలవాయి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో అంగన్‌వాడీ పిల్లలను సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పాలని ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ కోరారు. సోమవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చదువు పూర్తి చేసిన 427మంది విద్యార్థులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. ప్రతి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కవిత, అంగన్‌వాడీ సిబ్బంది మునీశ్వరి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించండి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు బీసీలు ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పది మంది బీసీలకు గతంలో ఇంటి పట్టాలు ఇచ్చిందన్నారు. ఇళ్లు నిర్మించుకోవాలని ప్రయత్నాలు చేస్తుంటే గ్రామంలో కొందరు అడ్డు పడుతున్నట్టు వాపోయారు. రెవెన్యూ అధికారులకు తెలిపిన పట్టించుకోలేదన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా 75 కిలోల కేక్‌ను కార్యకర్తలతో కలిసి కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో మే 10 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు.

సెక్యూరిటీ ఎస్వోపై అత్యాచారం కేసు నమోదు

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో భద్రతా విభాగంలో పని చేస్తున్న ఓ సెక్యూరిటీ అధికారి తనపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మహిళా కార్మికురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు శ్రీసిటీ పరిధిలోని ఓ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కులదీప్(27) సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. అదే పరిశ్రమలో పని చేస్తున్న తడ మండలానికి చెందిన ఒక మహిళ పట్ల కులదీప్ గత కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో మహిళ శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

25న జాబ్ మేళా

సద్వినియోగం చేసుకోవాలన్న ఎమ్మెల్యే

సత్యవేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో సత్యవేడులోని శ్రీదాస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 25న శుక్రవారం నిర్వహించనున్న మెగాజాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ పరంధాం, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ చైతన్యతో కలిసి జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో శ్రీసిటీతో పాటు చెన్నైకు చెందిన 16 బహుళ జాతీయ కంపెనీలలో 800 ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత రిజిస్ట్రేషన్ లింక్‌లో వివరాలను నమోదు చేసుకుని, తమ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని సంబంధిత అధికారులు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని అభయ క్షేత్రంలోని వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు క్రైస్తవులు సోమవారం దుప్పట్లు, భోజనం పంపిణీ చేశారు. రేణిగుంట బెతేల్ మందిరం పాస్టర్ కొర్నేలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన క్రైస్తవులు ప్రేమసుందరం, పాస్టర్లు దిలీప్, సాల్మన్ రాము తదితరులు పాల్గొన్నారు.